స్మృతిలో తీయనిది

జొకంటి జగన్నాథం

సరిగ్గా పదిహేను సంవత్సరాల తర్వాత రాఘవేందర్‌కు ఆమె మళ్ళీ ఇక్కడ కనిపిస్తుందనుకో లేదు. కనిపించినా తిరిగి ఇలా విడిపోవలసి వస్తుందనీ అనుకోలేదు

* * * *

రాఘవేందర్ ఉద్యోగరీత్యా మెదక్‌లో వుంటున్నా దగ్గరి మిత్రుని కొడుకు పుట్టు వెంట్రుకలని, పైగా చాలా రోజుల తరువాత ఇతర మిత్రులని కలువ వచ్చుననీ నూటయాభై కిలోమీటర్ల దూరమైన కొండగట్టుకు ఒక రోజు ముందుగానే బయలు దేరాడు

రాత్రి మిత్రుని భార్య పిల్లలతో చాలా పొద్దు పోయేదాకా మర్నాటి ఏర్పాట్లు చూసుకోవడం– పడుకొనే ముందు చిన్ననాటి మిత్రుల గురించి వివరాలు తదితర విషయాల గురించి మాట్లాడు కొని నిద్రపోయాడు. పైగా మిత్రుడు డాక్టరు– మీదు మిక్కిలి మాంచి ప్రాక్టీసున్నవాడు కాబట్టి చాలా మంది మిత్రులే ఈ కేశఖండన వుత్సవానికి రావచ్చు

ఎలా అయితేనేమి తెల్లవారింది గుట్టమీద ఆంజనేయస్వామి దేవాలయం– భక్తులు స్నానం చేయడానికి కోనేరు కోనేరుకు కుడి పక్కకు కొంచెం దూరములో గవర్నమెంటువారి వసతి గృహం గట్టు కింద మామూలు భక్తులకు ధర్మశాలలు ఇది ఒక మోస్తరు పేరున్న దేవాలయంలా వుంది భక్తుల హడావిడి 'బాగా లేదు వసతి గృహంలోని వాళ్ళు తప్ప చుట్టూ పచ్చని చెట్లు దూరంగా తెల్లగా పారుతున్న పోచంపాడు కాలువ– ప్రశాంతమైన ప్రకృతి వాతావరణం

రాఘవేందర్‌కు దైవభక్తి లేదు. కానీ భక్తులను చూసి ఎద్దేవ చేయడు ఎవరి అభిప్రాయాలు వారివి అని సరిపెట్టుకుంటాడు కాని తన నెవరన్నా దేవుని భక్తునిగా చేయదల్చుకుంటే మాత్రం చర్చలోకి దించి అతనిచేత 'లేదు వట్టిదే'నని ఒప్పించేదాకా వదలడు

వసతి గృహంలోనె స్నానం చేసి మిత్రుడు అందజేసిన టిఫిన్, టీలనూ పూర్తి చేసి ప్రకృతి వృక్షాలను కొంచెం దూరంలో వున్న బండమీద కూర్చుని చూస్తున్నాడు

ఉదయం పదకొండు గంటలకు కార్యక్రమం డాక్టరుగారి మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు రావడం మొదలయింది

'రఘూ! అరేయ్' ఎప్పుడొచ్చావురా అనే చిన్న నాటి మిత్రుల మాటలతో రాఘవేందర్ వెనకకు తిరిగి చూసాడు

చెప్పలేని ఆనందంతో రాఘవేందర్ మిత్రులందరి చేతిలో చేయి కలిపి చాలా రోజుల తర్వాత కాబట్టి కౌగిలించుకొని నీకు పిల్లలెందరురా!" అని, పిల్లలు లేనివాన్ని, 'అయ్యో ఇంకా పిల్లలే పుట్టలేదా' అని అరేయ్ నీ శ్రీమతి వచ్చిందా" అని ఒక్కొక్కరి మంచి చెడ్డలు అడిగాడు

మిత్రులంతా చాలా రోజుల తర్వాత కలుసుకోవడం వలన ఒకరినొకరు పలకరించుకో-డాలు– ఉద్యోగ ధర్మాల గురించి తమ తమ అనుభవాలు– బాస్‌ల కోపతాపాలు– తమ వద్ద కొచ్చేవారి నుండి ఎలా 'అమ్యా– అమ్యా'లు లాగడాలు– లంచాల తాలూకూ డబ్బుల పంపకాల వివరాలు– ఒకటేమిటి ఇంటి కిరాయి నుండి ఇల్లు కట్టుకునే దాకా, కిరసనాయిలు నుండి గ్యాస్ స్టవ్ దాకా పంజాబ్ నుంచీ ప్రత్యేక రాష్ట్రం కావాలంటున్న గూర్ఖాల దాకా, రామారావ్ నుంచీ రాజీవ్ దాకా, అంతర్జాతీయ సమస్యలు, చర్చల్లో చోటు చేసుకున్నాయి

సమయం పదకొండు గంటలు కావస్తుందని గెస్ట్ హౌస్ వైపు దారి తీసారు

గదిలో మంచముపై కూచుని మళ్ళీ కబుర్లు మొదలు పెట్టారు ఈలోపు మిత్రుని కొడుకు కేశ ఖండన, పూజ అయిపోయినట్లున్నాయి 'హో' మంటూ వచ్చారు ఆడవాళ్ళు, పిల్లలూ, మిత్రుని చుట్టాలు అంతా చేరారు గదులన్నీ నిండి పోయాయి కొందరు ఆడవాళ్ళు వంటలు తయారయ్యే వద్దకు, గదిలోకి, వరండాలోంచి ఇటూ అటూ కొంగులు బొడ్లో దోపుకుని నడుస్తున్నారు

అతిథులందరినీ పలకరించి మిత్రుడు మళ్ళీ పనిలోకి వెళ్ళిపోయాడు. వంటలు ఆలస్యం అయ్యేలా వుంది 'రమ్మీ' ఆడదామని కొందరు కార్డ్సు ముందేసుకున్నారు

రాఘవేందర్‌కు రమ్మీ అంటే పెద్ద ఇంటరెస్ట్ లేదు అయినా మిత్రుల బలవంతంమీద ఆడాడు మూడు ఆటలకే అవుటయిపోయాడు

పీడ విరగడయిందనుకొని ఆ రోజుటి పేపరు ముందేసుకుని చూస్తున్నాడు

ఎండకాలం గదిలో పిల్లల ఏడుపులు ఉక్కపోతకు

రాఘవేందర్ పేపర్‌ను పక్కకు పెట్టి వరండాకొచ్చి చూస్తున్నాడు కాంపౌండు గోడ ప్రక్కని మామిడిచెట్టు పైనుంచి ఆగి ఆగి వస్తున్న కోకిల పాటను వింటున్నాడు

ఈ మధ్యలో వరండాలో నుండి ఓ స్త్రీ గది ముందు నుండి దాటి తిరిగి మళ్ళీ వచ్చి చూసీ చూడనట్లు చూసింది. ఆమె అనుకున్నవారు అవునో కాదో నిర్ధారించుకోటానికి మరో మారు నిశితంగా ఈసారి తననే చూసి వెళ్ళింది.

రాఘవేందర్ చూపులు ఆమెపై పడ్డాయి. వెంటనే లేచి వరండాలోకొచ్చి ఆమె పోయిన గదికేసి చూసాడు తను ఎలాగైనా వచ్చి చూస్తాడను కున్నట్లే ఆమె తిరిగి అలాగే అతన్ని చూసింది.

అవును ఆమే నిజంగానే ఆమే– పదిహేను సంవత్సరాల కింద లంగా ఓణీలో చివరిసారిగా చూసిన ఆమె మున్నాటికీ తనతో పాటు ఎనిమిదో తరగతి వరకూ చదువుకున్న ఆమె – రియల్లీ తన బాల్య మిత్రురాలు ఆమె– సముద్రంలోని అలలుగా ఆనందం – మనసంతా – చలాకి మాటలు తన జీవితానికి చదువునూ సంస్కారం నేర్పినది ఆమె– ఆమే జయలక్ష్మి కాదు జయ.

రాఘవేందర్ మాట్లాడుదామనుకుని గది ముందువరకూ పోయాడు. కానీ చాలామంది స్త్రీలు వున్నారు గదిలో. కాస్సేపు ఆగాడు. బాగున్నావా అన్నట్లే కనులతోనే అడిగింది బాగానే వున్నానని కళ్ళు మూసి చెప్పాడు రాఘవేందర్.

రాఘవేందర్‌ను పక్కకు నెట్టుకుంటూ "జయా! జయా బాబు మట్టిలో ఆడుకుంటున్నాడు. తీసుకో " ఒకతను పిల్లవాన్ని ఆమెకు ఇచ్చి వచ్చినంత తొందరగా బయటకు వెళ్లాడు

రాఘవేందర్ ఆ స్థలంలో కొచ్చి రెండు నిమిషాల పైననే అయింది. ఎవరైనా చూస్తే ఏమైనా అనుకుంటారని కొంచెం దూరములో నున్న మామిడిచెట్లవైపు నడిచాడు.

రాఘవేందర్ మనసు పరిశోధన పూర్తిచేసిన తెలుగు మాష్టారిలా వుంది. ఇంతకుముందు తనను నెట్టుకుంటూ పోయినతను బహుశా జయ భర్త కావచ్చు– అవును జయ భర్తే సందేహం లేదు.

చిన్నపుడు రాఘవేందర్ అమ్మానాన్నల పరిస్థితి బాగులేక పెద్దమ్మకు పిల్లలు లేకపోయేసరికి పెంచుకుందామని అనుపురంకు తీసుకుపోయారు

పెద్దమ్మకు ఓ పది ఎకరాల పొలమూ ఇల్లూ వుండేది ఆ గ్రామంలో– పైగా పెదనాన్న ఊరిలో పెద్దమనిషి.

రాఘవేందర్ అమ్మానాన్నల వద్ద మూడవ తరగతి పూర్తిచేసి అనుపురంలో నాలుగవ తరగతిలో చేరాడు పుట్టిన ఊరిలో చదివిన చదువు వానాకాలం చదువే సరిగ్గా వాక్యాలే కలిపి చదువు రాకపోయేది. అమ్మానాన్నల గారాబం వల్ల సరిగ్గా స్కూలుకి పోయే వాడేకాదు.

నాలుగవ తరగతిలో చేరాడు. పెద్దనాన్న చాలా కటువైన మనిషి మనసులో ఏముందో తెలుసు కోవడం చాలా కష్టంగా ఉండేది. అంతేకాక కొత్త ఊరు స్నేహితులు లేరు ఇల్లూ తప్పితే స్కూలు

ఆ రోజు క్లాసులో టీచర్ తెలుగు వాచకంలోని ప్రశ్న అడిగారు, చాలామంది నిలబడ్డారు. అందులో రాఘవేందర్ కూడా వున్నాడు. జవాబు చెప్పినవారు చెప్పనివారి ముక్కు పట్టుకుని చెంపపై

దెబ్బకొట్టాలి. ఎర్ర టెర్లిన్ ఆఫ్ లంగా, జాకెట్ వేసుకున్న అమ్మాయి జవాబు చెప్పింది. అందరినీ కొడుతుంది. చాచి చెంపపై కొట్టిన దెబ్బ చప్పుడు రాఘవేందర్‌కు స్పష్టంగా వినవస్తుంది. ఆ అమ్మాయి తనదాకా వచ్చింది. ఎంత గట్టిగా కొడుతుందో అని కళ్ళు మూసుకున్నాడు. చాలా



మెల్లగా ఒక చిటికెలో కొట్టి పక్కనున్నవారిని మళ్ళీ బాగానే కొట్టింది. రాఘవేందర్ అప్పుడు అనుకున్నాడు. 'ఈమెకు మగపిల్లలపై ఎందుకంత ద్వేషం' అని- అలా అనుకుందామన్నా తనను మెల్లగానే కొట్టింది కదా' తనకు సిగ్గనిపించింది.

ఆ నాటి నుండి ఆమె అంటే ఎందుకో ఇష్టం స్నేహం చేయాలని కోరిక- ఆమే జయ తరువాత క్లాసులోని మిగతా పిల్లలు అంతా ఒక్కటి, జయ ఒక్కతే ఒక్కతి- వాళ్ళ మధ్యా ఆమె మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది

రాఘవేందర్ సాయంత్రం స్కూలు వదిలిపెట్టగానే ఇంట్లో పుస్తకాలు పడేసి జయ ఇంటికి పోయేవాడు కలిసి చదువుకునే వారు, కలిసి క్యారంబోర్డు ఆడేవారు. ఎండాకాలం వచ్చిందంటే కాలువలో ఈత కొట్టేవారు.

అయిదవ క్లాసు పూర్తి అయ్యేసరికి మిగతా పిల్లలందరి కంటే రాఘవేందరే మొదటి తరగతిలో పాస్ అయ్యాడు

జయకూ రాఘవేందర్‌కు స్నేహం బాగా పెరిగింది. సెలవు రోజు వస్తే పూర్తిగా వాళ్ళింట్లోనే గడిపేవాడు. కలిసి పొలాల దగ్గరికి పోవడం, బావిలో చేదను ఇద్దరు కల్సి పైకి లాగి చిన్న చిన్న నారు మళ్ళను పారించేవారు. కల్సి చదివే వారు. ఆడేవారు, స్కూలుకు పోయేవారు. ఒక్క పడుకోవడమే వేరు

జయ వాళ్ళ నాన్న పక్కనే వున్న పట్నణం హైస్కూల్లో గుమాస్తాగా వుండేవాడు. రోజూ సైకిలుపైన స్కూలుకు పోయి వచ్చేవాడు పట్నణం నుండి వారపత్రిక, పిల్లల పత్రిక, జయ నాన్న తెచ్చేవాడు

కొత్త వారపత్రిక రాగానే జయ అన్నిటినీ మరచి పూర్తి అయ్యేవరకు చదివేది. ఓకరోజు రాఘవేందర్, "ఎందుకు అంత బాగా చదువుతావు. అందులో ఏముంది?" అని అడిగాడు

జయ వివరాలు చెప్పింది చదవాలనే ఉత్సాహాన్ని తనలో నింపింది అంతే రాఘవేందర్ వార్తా పత్రికలనూ, నవలలనూ చదవడం మొదలు పెట్టాడు

ఏడవ తరగతి పూర్తి అయిపోవటానికి వచ్చింది

జయ రాఘువేందర్‌ను రఘు అని పిలిచేంతవరకూ స్నేహం కొనసాగింది.

రఘుకు జయన్నా ప్రాణం, జయకు రఘు అంటే ఇష్టం

ఒకసారి స్కూల్లో ఉపన్యాసాల పోటీ జరుగుతున్నది జయ కాగితం మీద రాసుకొచ్చి చదివింది. చారి నోటికి బట్టీ పెట్టి చదివాడు. జయను అందరూ ఎగతాళి చేసారు, చూసి చదివిందని 'రఘుకు కోపం వచ్చింది ఇంకా ఎవరైనా ఉపన్యాసం ఇవ్వాలనుకుంటే ఇవ్వొచ్చు అని టీచర్ చెప్పారు. అంతే రఘు వెళ్ళి ఆ నాటి శీర్షిక మీద పది నిమిషాలు ఆగి ఆగి మాట్లాడాడు

రఘుకు మొదటి బహుమతి వచ్చింది. అందరూ నోరు వెళ్ళబెట్టారు జయ చాలా సంతోషించింది రఘుకు కూడా సంతోషం కలిగింది

సాయంత్రం జయ వాళ్ళింటికి వెళ్ళి ఆనాటి విశేషాలు మాట్లాడుకున్నారు "చారికి మంచిగయిందని" అంది టీ తీసుకొచ్చి తాగుమని ఇచ్చింది రఘుకు ఏమిటో వాసన వేసి తాగనన్నాడు. జయ "అయ్యో! అది బోర్నవిటా తాగు చాలా మంచిది" అంది.

అవిధంగా రాఘువేందర్ జీవితంలో మొదటిసారిగా బోర్నవిటా రుచి చూసింది జయ ద్వారానే

రాఘువేందర్‌కు ఆ చిన్ననాటి విషయాలు జ్ఞాపకం వచ్చేసరికి నవ్వొచ్చింది దూరంగా గెస్ట్‌హౌస్‌లో భోజనాల కోసం సందడిగా వుంది జయ ఇవతలి వరకూ వచ్చి రఘును చూసింది ముందుకు రెండడుగులు వేసింది ఏమైందో ఏమోగానీ ఆ వైపు ఈ వైపు చూసి మళ్ళీ లోపలికే వెళ్ళిపోయింది

రాఘువేందర్‌కు బాధనిపించింది కనీసం "బాగున్నావా" అనైనా అడగలేదని "ఎక్కడున్నావు అని కూడా అడగనందుకు

రాఘువేందర్ తీయని జ్ఞాపకాల మధ్య గుండెను గాజుముక్కతో గీసినంత బాధపడ్డాడు

ఎంత వదిలించుకుందామనుకున్నా చిన్ననాటి స్మృతులు మనసు తెరపైకి వస్తూనే వున్నాయి

అవి వేసవి కాలం సెలవులు– దొరగారి పొలంలో

సృష్టిలో తీయనిది....

ఆ యేడు చెరకు పెట్టారు. ఊరిలోని ఆసాములు ఇళ్ళల్లో అందరూ చెఱకు తెచ్చుకొని తింటున్నారు.

జయా తను కాలువ దాటి సన్నటి పొలాల ఒడ్డును దాటి–చెరకు తోట వద్దకు చేరారు. ఇరవై ఎకరాలవరకు వేశారు. కావలివాడు ఎత్తయిన మంచంపైన పడుకొని వున్నాడు. వేసవి గాలి చెరకు తోటల్లోంచి "గుయ్యి" మంటూ వేడిగా చెవులను అదరగొడుతోంది

"ఎట్లా" అంటే "ఎట్లా" అనుకున్నారు.తాను భయమవుతుందన్నాడు.జయ నవ్వింది. తోట దగ్గరకు వంగి వంగి నడిచారు. జయ చెఱకు గడను పట్టుకొంది. విరుద్దామంటే విరగడు గడను కొంచం వంచిపక్కి గడపైన కాలు వేసి బలంగా చేయితో లాగి గనె వద్ద విరిచింది అంతే దీపావళి నాటి టపాకాయ శబ్దం అయింది.

కావలివాడు లేచి కిందికి దిగి ఎవడ్రా! అరేయ్ ఎవడ్రా " అంటూ రానాగాడు. తాను ఒక్కుమ్మించి పరుగందుకున్నాడు చెరకు గడ అలానే పట్టుకొని జయ వెనకనే వురికి వస్తూనే వుంది. కొంచెం దూరం పరుగెత్తి వెనకకు చూసారు– కావలివాడు తిట్టుకుంటూ వస్తూనే వున్నాడు.

తాను, జయ ఇంకా పరిగెత్తారు. కావలివాడు కనిపించకుండా పోయిన తరువాత వాగుదాకావెళ్ళి ఆగారు.

దమ్ము వస్తుంది గాలి ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు తాను అలాగే చిన్నవాగులోని ఇసుకలో కూలబడ్డారు ఆ వెంటనే జయ ఓపిక లేక గడను పక్కకు విసిరేసి పడిపోయి చేయితో అరికాలును చూసుకొంటుంది.

రక్తం కారుతుంది. అరికాలంతా రక్తమే అయింది 'అమ్మయ్యో' అంటూ రఘూ ఆమెకు రక్తం కారుతున్న చోట గట్టిగా పట్టుకున్నాడు

కొంచెంసేపటికి రక్తం ఆగింది. పక్కన చెలమ తోడాడు తాను జయ నీళ్ళు తాగారు

'రఘు! ఈ చెఱకు తిను' అంటూ ఓ మూరెడు తనకు ఇచ్చి తనో మూరెడు నములుతూనే వుంది.



రఘుకు సరిగ్గా తినరాకుంటే చిన్న రాయితో పగులగొట్టి చెఱకు పైని వెళ్ళు తీసివేసి ఒక్కొక్కటి తనకు ఇస్తూ తనూ తినసాగింది.

సుడిగాలి ఒక్కసారి రాఘువేందర్‌ను కమ్మేసింది. కళ్ళల్లో దుమ్ముపడకుండా కళ్ళకు రెండు చేతులు అడ్డంపెట్టుకున్నాడు.

కడుపులో ఆకలి చంపేస్తూంది. గెస్ట్ హవుస్ వైపు చూసాడు అందరూ భోజనాలు చేస్తున్నారు

లేచి ఆ వైపు నడిచాడు

జయకూడా భోజనాలు వడ్డిస్తూంది మామూలు ఎత్తు అయినా కొంచెం ఒళ్ళుచేసి లావు అయినట్టు అగుపిస్తూంది.

ఓ వరుసలో మిత్రుల పక్కన కూర్చున్నాడు. జయ అవతల పంక్తిలో భోజనాలు వడ్డిస్తూ ఈ వైపు చూసి చూడనట్టు చూస్తుంది ఆమె భర్త భోజనం చేసి బాబును ఎత్తుకున్నాడు రాఘువేందర్ రెండు ముద్దలు తిన్నాడు సహించడంలేదు

తన కళ్ల ముందే వున్న జయతో ఐదు సంవత్సరాలు కలిసి వుండి తలపుల్ని కలబోసుకున్న తనూ ఆమెతో మాట్లాడలేకపోతున్నాడు

చేయి కడిగి మధ్యలో నే లేచాడు.

మగవారి అందరి భోజనాలు అయ్యాయి.

రాఘువేందర్‌ను మిత్రుడు కొత్తవారికి తనను పరిచయం చేస్తున్నాడు కవి, రచయిత అని

వరండాలో భోజనం చేస్తున్న జయ మా మాటలు విని మళ్ళీ వెనక్కి తిరిగి చూసింది

జయ ఆనందంతో కళ్లలోని నీటిని కొంగుతో తుడుచుకుని భోజనం మధ్యలో నుండి లేచిపోయింది

రాఘువేందర్ మనసు ఎండాకాలపు ఆకాశంలా బోసిగా వుంది

జయ బాబును ఎత్తుకుని అందరికీ చెప్పి భర్త స్కూటరు వెనక కూర్చుంది స్కూటర్ స్టార్ట్ అయింది

మనసులో అనుకున్నాడు 'జయ తననెందుకు పలకరించలేదు పోనీ తానుకూడా ధైర్యంచేసి ఎందుకు మాట్లాడలేదు చిన్ననాటి మిత్రులు మిత్రులుగా కలసి ఉండటానికి వీల్లేదా పలకరించుకోవడం కూడా తప్పా?'

కనుచూపు మేర దాటిపోయిన స్కూటర్ వెనక కూర్చున్న జయ మనసులో కూడా సరిగ్గా ఇదే ప్రశ్నలు తలెత్తాయి

స్వేచ్ఛగా మాట్లాడుకోవటానికి వీలులేని ఈ సమాజం యొక్క వికారాలను చూసి రాఘువేందర్‌కు కోపమొచ్చింది

అయిదు సంవత్సరాలు ఒక జీవితకాలంపాటు నిలిచిపోయేంతటి అనుభవాలను కలిసి పంచుకున్న మిత్రులు మాట్లాడుకోవటానికి వీలులేని పరిస్థితులను కల్పించిన ఈ సమాజం అడుగడుగునా నర నరాల్లోనూ మనస్సులోనూ పెంచి పోషింపబడుతున్న ఈ అడ్డుగోడలు రాఘువేందర్ మనసును ఎంతో కుంగదీసి కలచివేసాయి □